

శ్రీ ఆంజనేయం

» రామయ్య సన్నిధిలో హనుమాన్ దీక్షల విరమణ
» దాసాంజనేయస్వామికి ఏకాంత విశేష స్నపనం
» రామాలయాన్ని దర్శించిన 25 వేల మంది
» ఇరు జిల్లాల్లో హనుమాన్ ఆలయాల్లో భక్తుల రద్దీ

భద్రాచలం/ ఖమ్మం ఖానాపురం హవేలి, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి గురువారం హనుమాన్ భక్తులు, దీక్షాధారులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన భక్తులతో భద్రాచలం ప్రత్యేక శోభను సంతరించుకుంది. దీక్షల విరమణ నేపథ్యంలో బుధవారం రాత్రికే వేలాది మంది భక్తులు భద్రాచలానికి తరలివచ్చారు. వేకువ జాము నుంచే పవిత్ర గోదావరి నదికి చేరుకొని పుణ్య స్నానాలు ఆచరించారు. జై శ్రీరామ్.. జైజై హనుమాన్, జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ అంటూ రామనామస్మరణతో.. తమ ఆరాధ్య దైవమైన భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. సుమారు 25వేల మంది మాలధారులు శిరస్సుపై ఇరుముడి ధరించి తెల్లవారుజామున మూడు గంటల నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకున్న తరువాత వాటిని ఆంజనేయస్వామి ఆలయం లో సమర్పించారు. కాగా దేవస్థానం అధికారులు హనుమాన్ భక్తుల కోసం శీఘ్ర దర్శనం, దేవస్థానం ఉచిత నిత్యాన్నదాన సత్రంలో అన్న ప్రసాదం అందిచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర ఉమ్మడి జిల్లాల నుంచి వేల సంఖ్యలో తరలొచ్చారు.



భద్రాచలంలో క్యూలైన్లలో భక్తులు

భద్రాద్రిలో సాయంత్రం హనుమంతుడి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు భద్రాచలంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో కూడా దీక్షా విరమణ గావించారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు రవికిరణాచార్యులు ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షితుల విరమణ కోసం ప్రత్యేక పూజలు, హనుమత్ హోమం, సామూహిక సహస్రనామార్చన పూజలు నిర్వహించారు. హనుమాన్ భక్తులు దీక్షా విరమణ గావించారు. తాతగుడి సెంటర్లో, వెంకటేశ్వర కాలనీలోని ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో కూడా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదానం నిర్వహించారు. భద్రాచలం (మిగతా 6వ పేజీలో)



జూలూరుపాడు మండలం పాపకొల్లులో పంచముఖ హనుమంతుడు

నేడు, రేపు జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన



ఖమ్మం కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్ర, శనివారాల్లో ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 7గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి 10.30కి వెంకటగిరి క్రాస్ రోడ్డుకు చేరుకుంటారు. అక్కడి ఓ ఫంక్షన్ హాలులో జరిగే ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత 10.45కి ఖమ్మం గాంధీచౌక్‌లో కిరాణజాగిరి మర్చంట్స్ ఆధ్వర్యంలో జరిగే ప్రైవేటు కార్యక్రమానికి హాజరవుతారు. 11.గంటలకు పాండురంగాపురం లో డ్రెయినేజీకి శంకుస్థాపన చేస్తారు. 12గంటలకు వైరా రోడ్డులో ఓ ఫంక్షన్‌హాల్లో జరిగే ప్రైవేటు కార్యక్రమానికి, 12.30కి కొదుమూరులో ప్రైవేటు ఫంక్షన్‌కు హాజరవుతారు. 24ఉదయం రఘునాథపాలెంలో కోటపాడులో బ్రిడ్జికి, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు.

రేపు జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం ఉదయం 6.50గంటలకు కర్ణాటక నుంచి విమానంలో బయల్దేరి ఉదయం 8.30కి విజయవాడ విమానాశ్రయానికి చేరకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 10.30గంటలకు మధిరకు చేరుకుంటారు. శనివారం ఉదయం 10గంటలకు బయల్దేరి 11గంటలకు వైరా చేరుకుంటారు. 12.30వరకు జాబ్‌మేళాలో పాల్గొంటారు. ఆ తర్వాత 1గంటకు ఖమ్మం చేరుకుని ప్రజాభవన్‌లో 6గంటల వరకు ఉంటారు. అక్కడి నుంచి రాత్రికి హైదరాబాద్‌కు వెళ్లిపోతారు.

మూడో లైన్ పనులతో పలు రైళ్ల రద్దు



» నేటి నుంచి 29వ తేదీ వరకు సర్వీసుల నిలుపదల
» మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల కారణంగా ఉత్తర్వులు

వివరాలు : 6లో



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

» వచ్చేనెల 2 నాటికి మండలాల్లో భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి
» 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలి
» ఏదులాపురం మునిసిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దండి
» రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
» జిల్లా అధికారులతో సమీక్ష

ఖమ్మం, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి అమలు, ఏదులాపురం అభివృద్ధిపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను అధికారులు చిత్తశుద్ధితో పూర్తిచేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతగా ప్రతీ మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపికచేసి జిల్లా వ్యాప్తంగా 875 ఇల్లు మంజూరు చేశామన్నారు. ఇందులో 475 గ్రౌండింగ్ అయ్యాయని, 425పైగా బేస్‌మెంట్ పూర్తి చేసి మొదటి విడత కింద రూ.లక్ష మంజూరుచేశామన్నారు. ఇళ్లు మంజూరై కట్టుకోవడానికి సిద్ధంగా లేనివారి నుంచి అనుమతి తీసుకుని అర్హులైన మరొకరికి మంజూరు చేయాలని సూచించారు. ప్రతీ సోమవారం విడతల వారీగా డబ్బులు మంజూరు చేసి లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రెండో విడత కింద నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించగా జిల్లాకు 17,983 ఇందిమర్మ ఇళ్లు మంజూరే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 12,276 ఇళ్లకు సంబంధిత నియోజకవర్గాలనుంచి ప్రతిపాదనలు రాగా ఇప్పటికి 7,212 ఇళ్లకు ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదం లభించిందన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల జాబితా వచ్చే నెల మొదటివారిలోపు పూర్తి చేయాలని విధి విధానాలు రూపొందించి వారికి కేటాయించాలన్నారు. ఇళ్ల స్థలం లేని వారిని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకానికి అర్హులుగా గుర్తించాలన్నారు. భూ భారతి కింద ప్రతీ మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని ఎంపికచేసి ఆ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో బోనకల్ మండలంలో అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. నేలకొండపల్లి మండలంలో 3,264 దరఖాస్తులు స్వీకరించగా ఇందులో 1,786సాదాబైనామా దరఖాస్తులున్నాయని, కోర్టునుంచి సాదాబైనామాపై న్యాయ పరిష్కారం లభించగానే దరఖాస్తులు పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ భూమి భూసేకరణ చేసిన భూమి విషయంలో జాగ్రత్తలు చేపట్టాలని, అసైన్డ్ భూమిలో ఉన్న పేద వారికి పట్టాలిచ్చి వారి ఇబ్బందులు తొలగించాలన్నారు. జిల్లాలోని ఎర్రుపాలెం మండలం మొలుగుమాడును రీసర్వే పైలెట్ కింద ఎంపిక చేశామని, ఈగ్రామంలో రీసర్వే పూర్తిచేసి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో రాష్ట్రమంతా రీసర్వే చేయిస్తామన్నారు. జూన్ 2నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ బృందాలు సర్వేకి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి మండలానికి రెండు బృందాలు సిద్ధంచేయాలని జిల్లాలో 465లైసెన్సు సర్వేయర్లకు దరఖాస్తు చేశారని వీరందరికీ శిక్షణనివ్వనున్నట్టు తెలిపారు. ఏదులాపురం మునిసిపాలిటీని సుందరగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన పనులను సిద్ధం చేయాలన్నారు. 32 వార్డులు 60 వేల జనాభా ఉన్నందున పారిశుధ్యం, పెండింగ్ బిల్లుల అనుమతులపై దృష్టిసారించాలని కోరారు. తాగు నీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, హైటెన్షన్ వైర్లు తొలగించాలన్నారు. తీగల వంతెన నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన 28మందికి ప్రత్యామ్నాయం చూపాలన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక భూభారతి దరఖాస్తుల పరిష్కారం, ఏదులాపురం మునిసిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెడతామని తెలిపారు ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, ఆర్డీవోలు నరసింహారావు, రాజేందర్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఏడీ సర్వేల్యాండ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు తావు లేకుండా ప్రత్యేక బృందాలు

సమీక్ష అనంతరం మంత్రి పొంగులేటి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అక్రమాలకు తావులేకుండా ప్రత్యేక బృందాలను ఏర్పటుచేశామని, పథకాల అమలుకు పారదర్శకంగా పనిచేస్తున్నామని తెలిపారు. జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున వెయ్యికిపైగా ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశం చేయనున్నారని తెలిపారు. భూ భారతి కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో అవినీతి లేకుండా సమస్యలు పరిష్కరించేందుకు (మిగతా 6వ పేజీలో)

అడిషనల్ డీసీపీ నరేష్ బదిలీ

ఖమ్మం ఖానాపురం హవేలి/ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్‌లో అడిషనల్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న ఏ. నరేష్ కుమార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను జయశంకర్ భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో ఖమ్మం కమిషనరేట్‌కు ఎవరినీ కేటాయించలేదు.

కొత్తగూడెం అదనపు ఎస్పీ(ఆపరేషన్స్)గా నరేందర్



కొత్తగూడెం అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా జి.నరేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను విడుదల చేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాంతానికి చెందిన నరేందర్‌కు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. వెయిటింగ్‌లో ఉన్న నరేందర్ తొలి పోస్టింగ్‌గా ఏఎస్పీ హోదాలో కొత్తగూడెం ఓఎస్‌డీగా నియమితులయ్యారు.

మహిళా సొసైటీలకు పూర్తి బాధ్యతలు

» భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్

వివరాలు : 6లో

తండ్రీ, కొడుకు దుర్మరణం

» ఆహ్వాన పత్రికలు ఇచ్చి వస్తుండగా రోడ్డు ప్రమాదం
» ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ » ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

తల్లాడ, మే 22 (ఆంధ్రజ్యోతి): తన పెద్ద మామ మనుమరాలు ఓణీల వేడుక ఆహ్వాన పత్రికలను బంధువులకు ఇచ్చి తిరుగుపయనమైన క్రమంలో జరిగిన రోడ్డుప్రమాదంలో తండ్రీకొడుకు దుర్మరణం చెందారు. ఈ సంఘటన గురువారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం ఎన్టీఆర్ నగర్ వద్ద తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలివీ.. ఖమ్మంజిల్లా కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి రాంబాబు(26) గురువారం తన బైకుపై తల్లాడ మండలం రామచంద్రాపురం గ్రామంలో ఉన్న తన మామ కత్తి వెంకటి ఇంటికి వచ్చాడు. వేసవి సెలవులకు వచ్చి మామ ఇంట్లో ఉన్న తన పెద్ద కుమారుడు క్రిషాంత్(6)ను తీసుకుని.. తన పెద్ద మామ అయిన కత్తి రామయ్య మనుమరాలి ఓణీల వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఇచ్చేందుకు తల్లాడ మండలం మల్లవరం గ్రామంలోని బంధువుల ఇళ్లకు వెళ్లాడు. అక్కడ ఆహ్వాన పత్రికలు ఇచ్చి తిరిగి తమ స్వగ్రామమైన చంద్రుపట్ల బయల్దేరగా.. మార్గమధ్యలో ఎన్టీఆర్ నగర్ వద్ద సత్తుపల్లి నుంచి జగ్గయ్యపేట వెళుతున్న లారీ వారి బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు అతడి కుమారుడు క్రిశాంత్ తీవ్రంగా గాయపడ్డారు. అప్పటికే వారి పరిస్థితి విషమంగా ఉండగా.. 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. రాంబాబు కల్లూరులోని ఓ హోటల్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య ఇద్దరు కుమారులు ఉండగా.. పెద్దకుమారుడు ఈ ప్రమాదంలో మరణించాడు.



కొత్తపల్లి రాంబాబు, క్రిశాంత్(ఫైల్)



చివరి దశలో యాసంగి కొనుగోళ్లు

» 1,70, 860 మెట్రిక్ టన్నుల ధాన్యం కాంటాలు
» 394.81కోట్ల విలువైన వడ్ల సేకరణ
» ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.332కోట్లు జమ

ఖమ్మం, మే22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో చివరి దశకు చేరుకుంటోంది. ఈనెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు ముగిసే అవకాశం ఉంది. ఎక్కడైనా గ్రామాల్లో రైతుల వద్ద ధాన్యం ఉంటే ఆ గ్రామాల్లో ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు కొనసాగించనున్నారు. జిల్లాలో యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యాన్ని ఇప్పటి వరకు 1లక్షా70వేల860 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు.

351 కేంద్రాల్లో కొనుగోళ్లు...

జిల్లాలో 162 సహకారసంఘాలు, 156 స్వయం సహాయక సంఘాలు, 30డీసీఎంఎస్, మెప్మా ద్వారా మూడు కొనుగోలు కేంద్రాలతో సహా మొత్తం 351 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత రెండు నెలలుగా ముమ్మరంగా గ్రామాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు రూ.394.81కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటి వరకు రూ.332కోట్లు రైతులకు జమచేశారు. ఇంకా రూ.63కోట్ల మేర రైతుల ఖాతాల్లో జమకావాల్సి ఉంది.

ధాన్యం సేకరణలో ఇబ్బందులు...

ఈ యాసంగి సీజన్ మొదట్లో ధాన్యం కొనుగోలులో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. పెద్దఎత్తున ధాన్యం దిగుమతి కావడం, ఒకేసారి కోతలు కోయడంతో జిల్లాలో ఉన్న మిల్లులకు సీఎంఆర్ కింద కేటలాయింపులు జరిపినా స్థలం లేక ఇబ్బందులు పడ్డారు. ఇటు మిల్లర్లు కూడా సొంతంగా ప్రైవేటుగా ధాన్యం కొనుగోలు చేయడంతో మిల్లుల్లో ధాన్యం పేరుకుపోయింది. అటు వానాకాలం ధాన్యం, ఇటు వేసవి ధాన్యం మిల్లులకు తోడుకావడంతో ధాన్యం ఆడించడం కూడా మిల్లు యజమానులు ఇబ్బంది పడ్డారు. దిగుమతి కూలీలు లేక కొంత జాప్యం జరిగింది.

అకాల వర్షాలతో అవస్థలు..

ఎన్నడులేని విధంగా ఈసీజన్‌లో అకాలవర్షాలు వారంలో రెండు మూడుసార్లు పడడంతో రైతుల ధాన్య తడిచి ఇబ్బంది పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో కూడా అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఈపరిస్థితుల్లో హనుమకొండ జిల్లాకు 75వేల మెట్రిక్ టన్నుల ధాన్యంను సీఎంఆర్ కింద కేటాయిస్తూ అనుమతి తీసుకున్నారు. దీంతోజిల్లాలో మిల్లులపై భారం తగ్గి త్వరితగతిన ధాన్యం సేకరణ జరిగింది. లావు రకం ధాన్యం హనుమకొండకు తరలించగా సన్నరకాలు జిల్లాలోని మిల్లులకు కేటాయించారు. మొత్తంమీద ధాన్యం సేకరణ ప్రక్రియ నెలాఖరులోగా, జూన్ మొదటి వారంలో పూర్తయ్యే అవకాశం ఉంది.





చుంచుపల్లిలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రాంభమయ్యయని ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు తెలిపారు. గురువారం ఉదయం జరిగిన మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షకు మొత్తం జనరల్ విద్యార్థులు 3,230 మందికి 3,039 మంది, ఒకేషనల్ విద్యార్థులు 253 మందికి 229 మంది.. మొత్తం 3,483 మందికి 3,268 మంది పరీక్షకు హాజరయ్యారని (మిగతా 6వ పేజీలో)



ఆగని ఇసుక దందా

ఆంధ్రప్రదేశ్ నుంచి సత్తుపల్లికి అక్రమంగా సాగుతున్న వైనం

పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న సత్తుపల్లి నియోజకవర్గంలోకి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ దందాకు పాల్పడుతున్న వారు అధికారుల కళ్లుగప్పడానికి హైటెక్ పద్ధతులు ఉపయోగిస్తున్నారు. ఎక్కడి కక్కడ ఏజెంట్లను నియమించుకుని గుట్టుచప్పుడు కాకుండా భారీ వాహనాలలో ఇసుకను రవాణా చేస్తున్నారు. దీనికోసం ఏకంగా పైలెట్ వాహనాలను ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. 7

మూడోలైన్ పనులతో పలు రైళ్ల రద్దు



ఖమ్మం మామిళ్లగూడెం, మే 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలో మహబూబాబాద్ స్టేషన్ వద్ద మూడో లైన్ పనులను నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఖమ్మం స్టేషన్‌కు రావాల్సిన పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రళ్లను రైళ్లను రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లించినట్లు వారు తెలిపారు.

ఇండోర్- కొచ్చి, కొచ్చి- ఇండోర్, కోర్బా- త్రివేండ్రం, త్రివేండ్రం- కోర్బా , విశాఖపట్నం వెళ్లే పలు ఎక్స్ ప్రెస్ రైళ్లను 29 వరకు రద్దు చేశారు. ఇక గుంటూరు-సికింద్రాబాద్, సికింద్రాబాద్-గుంటూరుతో పాటు మరో ఐదు ఎక్స్‌ప్రెస్ రైళ్లను గుంటూరు మీదుగా నడపనున్నటుల తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు..

రైలు నెంబర్	రైలు పేరు	వారం	రద్దయిన రోజు
67765	ఖాజీపేట- డోర్నకల్	ప్రతిరోజు	23 నుంచి మే 29 వరకు
67767	డోర్నకల్- విజయవాడ	ప్రతిరోజు	23 నుంచి 29 వరకు
67768	విజయవాడ- డోర్నకల్	ప్రతిరోజు	23 నుంచి 29 వరకు
67766	డోర్నకల్ - ఖాజీపేట	ప్రతిరోజు	23 నుంచి 29 వరకు
67215	విజయవాడ- భద్రాచలం	ప్రతిరోజు	23 నుంచి 29 వరకు
67216	విజయవాడ- డోర్నకల్	ప్రతిరోజు	23 నుంచి 29 వరకు
12705	గుంటూరు- సికింద్రాబాద్	ప్రతిరోజు	23 నుంచి 29 వరకు
12706	సికింద్రాబాద్- గుంటూరు	ప్రతిరోజు	23 నుంచి 29 వరకు
12713	విజయవాడ- సికింద్రాబాద్	ప్రతిరోజు	23 నుంచి 29 వరకు
12714	సికింద్రాబాద్- విజయవాడ	ప్రతిరోజు	23 నుంచి 29 వరకు

ప్రైవేట్ డయాలసిస్ కేంద్రం సీజ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే22 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంగిస్తూ కొనసాగుతున్న కొత్తగూడెంలోని స్వేచ్ఛ ప్రైవేటు ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని భద్రాద్రి జిల్లా డీఎంహెచ్‌వో, డిప్యూటీ డెమో ఫైజ్ మోహినుద్దీన్ బృందం తనిఖీ చేసి గురువారం సీజ్ చేశారు. సాధారణ ఆరోగ్య సౌకర్యాల ఆడిట్‌లో భాగంగా కొత్తగూడెంలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించారు. ఈ తనిఖీకి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ తేజశ్రీ, సీహెచ్‌వో సీహెచ్ నాగభూషణంతో కలిసి పరిశీలించగా ఈ ఆస్పత్రిలో అవకతవకలు గుర్తించారు. చట్టాన్ని ఉల్లంఘించినట్లు తేలడంతో ఆ డయాలసిస్ కేంద్రాన్ని సీజ్ చేశారు.



డయాలసిస్ కేంద్రాన్ని సీజ్ చేసిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

పశుగ్రాసం.. సుపోషకం



ఖమ్మం వ్యవసాయం, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో వరి గడ్డి ప్రదానమైన పశుగ్రాసం. వరి గడ్డిని ఎండబెట్టి వాముగా వేసి వేసవిలో పశువుల మేతగా వాడటం సహజం. కానీ వరి గడ్డి పోషక పదార్థాల రీత్యా పాల దిగుబడికి అంత దోహదకారి కాదు. అంతేకాక వరి గడ్డిలో పశువు శరీరంలో ఉండే ముఖ్యమైన లవణ ధాతువు కాల్షియంను నష్టపరిచే లక్షణం ఉంది. వరి గడ్డిలో మాంసకృత్తులు లేవు. జీర్ణమవదగిన ఆహార పదార్థాలు కేవలం 45శాతం ఉన్నాయి. కాబట్టి వరిగడ్డిని సుపోషకం చేయటం అవసరం. వరి గడ్డిని సుపోషకం చేయడానికి యూరియాని వాడుతారు. ఈ పద్ధతిని 'యుటిపిఎస్' అని కూడా అంటారు.

సుపోషకం చేసే విధానం..

ఒక రోజుకు ఒక పాడి పశువుకు ఆరు కిలోల సుపోషకం చేసిన వరి గడ్డిని ఆహారంగా ఇవ్వవచ్చు. దీని ప్రకారం ఒక పశువుకు ఒక వారానికి దాదాపు 50 కిలోల సుపోషకం చేసిన వరి గడ్డి అసవరమవుతుంది. రెండు పద్ధతులతో వరి గడ్డిని యూరియాతో సుపోషకం చేయవచ్చు. 100 కిలోల వరి గడ్డికి, 4 కిలోల యూరియా 60 లీటర్ల నీళ్ల అవసరమవుతాయి. మొదట యూరియాను నీళ్లలో బాగా

ప్రత్యేక పద్ధతిలో యూరియాతో మిశ్రమం

కరిగేటట్లు చూడాలి. తరువాత వరి గడ్డిని నేల మీద పరచి యూరియా కరిగిన నీళ్లను గడ్డిపై పూర్తిగా తడిచేలా చల్లాలి. తరువాత యూరియా నీటితో తడిపిన గడ్డిని పాతర గోతిలో గాని, యూరియా బస్తాలలలో గాని లేదా ప్లాస్టిక్ షీట్‌తో గానీ గాలి చొరబడకుండా జాగ్రత్తగా భద్రపరచి వారం రోజుల పాటు మాగనిస్తే వరి గడ్డి వాడకానికి సిద్ధం అవుతుంది. వరి గడ్డిలో ఉండే పీచు పదార్థం తగ్గి పశువులు ఎక్కువ మేతను తినగలవు, జీర్ణం చేసుకోవడం కూడా సులభం. ఈ పద్ధతిలో వరి గడ్డిలో మాంసకృత్తులను 0 నుంచి 5శాతం పెంచవచ్చు. వరి గడ్డిలో ఉండే జీర్ణమవదగ్గ ఆహార పదార్థాలు 45శాతం నుంచి 60శాతం పెరుగుతాయి. ఎండు వరి గడ్డిలో తేమ శాతం 10శాతం ఉండి తినడానికి ఇబ్బంది ఉంటుంది. సుపోషకం చేయడం వలన తేమను 45శాతం వరకు పెంచవచ్చు. యూరియాతో సుపోషకం చేయటం వలన తక్కువ ఖర్చుతో మాంసకృత్తులను పొందవచ్చు. ఈ పద్ధతి పాడి రైతులు అమలు చేయడానికి అనువైనది, సులభమైనది. సుపోషకం చేయబడిన గడ్డి రంగు ముదురు గోధుమ రంగుగా మారి కొద్దిగా అమ్మోనియా వాసన వస్తుంది.

అలవాటు చేయాలి

కొన్ని పశువులు మొదట ఈ గడ్డిని తినడానికి ఇష్టపడకపోవచ్చు. అటువంటి వాటికి కొద్దికొద్దిగా మేపి అలవాటు చేయాలి. పశుపోషణలో పచ్చిమేత, దాణా ఎంత ముఖ్యమో.. వాటి ద్వారా ఖనిజ లవణాల లభ్యత కూడా అంతే ముఖ్యం. అంతేగాక పాడి పశువుల పాల ఉత్పత్తి స్థాయితో పాటు వాటి శరీర కార్యక్రమాలను నిర్వర్తిస్తూ నష్టాలను భర్తీ చేసుకుంటూ ఆరోగ్యవంతంగా ఉండడానికి అవసరమైనంత ఖనిజ లవణాలను అందించడం కూడా అంతే ముఖ్యం.

ఎస్ఈ, ఈఈగా బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఈ వెంకటరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

ఖమ్మం కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఎస్‌ఈగా వెంకటరెడ్డి గురువారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటి వరకు ఈఈగా ఖమ్మంలోనే పనిచేశారు. ఆయన స్థానంలో డీఈగా పనిచేస్తున్న మహేష్‌కు ఈఈగా పదోన్నతి కల్పించారు. ఈనేపథ్యంలో గురువారం మహేష్ ఈఈగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది పలువురు ఎస్‌ఈ వెంకటరెడ్డి, ఈఈ మహేష్‌ను అభినందించారు. ఆ తర్వాత ఎస్‌ఈ వెంకటరెడ్డిని ఈఈ మహేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి

- అనారోగ్యంతో ఉన్నవారిని హతమార్చి కేంద్రం ప్రగల్భాలు
- విలేకరుల సమావేశంలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ధ్వజం



కరపత్రాన్ని విడుదల చేస్తున్న వామపక్ష నాయకులు, ప్రజాసంఘాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని వామపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం మంచికంటి భవన్‌లో వామపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు, మేధావులంతా కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రత్యామ్నాయ పౌర సమూహం కాకి భాస్కర్, రవిమారుత్, ఎంఎఫ్ గోపినాథ్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, ఎన్డీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, పీపుల్స్ జేఏసీ చైర్మన్ దేవిరెడ్డి విజయ్‌లు శాంతి చర్చల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేశరావుతో పాటు మరో 26మందిని పట్టుకొని కాల్చి చంపి.. ఎన్‌కౌంటర్‌గా పేరు పెట్టి కేంద్ర ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోందని, రాజ్యాంగమిచ్చిన జీవించే హక్కును కాలరాస్తోందని మండిపడ్డారు. మూడు నెలలుగా మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణ ప్రకటించిందని, కేంద్ర ప్రభుత్వంతో శాంతిచర్చలు జరిపేందుకు అనేక పర్యాయాలు సందేశాలను పంపిందన్నారు. కానీ అమాయక ఆదివాసీలను లక్ష్యాలుగా చేసుకొని అటవీ ప్రాంతంపై పడి స్వదేశంలోని గిరిజనులపై కేంద్ర ప్రభుత్వం యుద్ధం చేశారన్నారు.

పెహల్గాంలో భారతీయులను కాల్చి చంపిన ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టుకోలేకపోయిందన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న మోదీ విధానాలను పౌర సమాజం నిలదీయాలని పిలుపునిచ్చారు. నాయకులు వై.విక్రమ్, సీవై పుల్లయ్య, ఝాన్సీ చిర్రా రవి, స్వర్ణ సుబ్బారావు, సురేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళా సొసైటీలకు పూర్తిస్థాయి బాధ్యతలు

- సొంతంగా ఇసుక ర్యాంపులు నడుపుకొని జీవనోపాధి పొందాలి
- భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



ప్రసంగిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, మే 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో పెసా చట్టం ప్రకారం ఆదివాసీ గిరిజన మహిళలు సొంతంగా ఇసుక ర్యాంపులు నడుపుకొని జీవనోపాధి పెంపొందించుకోవడానికి గిరిజన మహిళా సొసైటీలకే పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగిస్తామని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏజెన్సీ ప్రాంతంలోని ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్న మహిళ సొసైటీల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇసుక ర్యాంపులు నిర్వహించుకునే గిరిజన మహిళలకు సాంకేతిక సహకారం అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెసా స్పెషల్ ఆఫీసర్ అశోక్ కుమార్, టీఎస్ఎండీసీ ప్రాజెక్టు మేనేజరు శంకర్‌నాయక్, ఏడీ మైన్స్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- స్టేడియంలో ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ శిబిరం
- వేసవి శిబిరానికి పోటెత్తుతున్న విద్యార్థులు



స్టేడియంలోని వేసవి శిబిరంలో టీటీ శిక్షణలో చిన్నారులు

ఖమ్మం స్పోర్ట్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు ఒక చిన్న టేబుల్ పై సరదాగా ఆట నేర్చుకొని పెద్ద పెద్ద టోర్నమెంట్లలో రాణిస్తున్నారు. మూడేళ్లుగా ఉత్తమ ఫలితాలతో పాటు పతకాలు సాధిస్తుండటంతో జిల్లా అధికారులు, క్రీడాశాఖ ఆ ఆటకు పెద్ద పీట వేసి ఏకంగా స్టేడియంలో కేవలం ఆ క్రీడ కోసమే పెద్ద ఇండోర్ హాల్‌ను నిర్మిస్తుండటం విశేషం. అదేంటండి ఆచిన్న టేబుల్ ఏంటి.. ఆ పెద్ద ఆట ఏంటని అనుకుంటున్నారా.. అదే నండి టేబుల్ టెన్నిస్. జిల్లాలో ఐదు సంవత్సరాల క్రితం స్టేడియంలోకి సీనియర్ కోచ్, వ్యాఖ్యాత ఓలేటి సాంబమూర్తి నాటి జిల్లా క్రీడల అధికారి చొరవతో ఒక చిన్న గదిలో రెండు టీటీ బోర్డులను ఏర్పాటు చేశారు. మొదట్లో ఆ ఆటపై ఎవరూ మక్కువ చూపక పోవడంతో బాధపడ్డ ఆయన ఆ క్రీడ గురించి, టోర్నీల్లో రాణిస్తే వచ్చే హూందాతనం గురించి కనపడ్డ ప్రతీ ఒక్కరికి, పరిచయస్తులకు వివరించారు. మీ పిల్లలను శిక్షణకు పంపించండి ఆతరువాత నేను చూసుకుంటా అంటూ భరోసా ఇచ్చారు. ఒక 20 మంది పిల్లలను తయారు చేసి వారిని మెరికల్లా తయారు చేశాడు. టీటీలో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తుండటంతో మరింత ఫలితాల కోసం జిల్లా యంత్రాంగం రూ. 50 లక్షల పైచిలకు నిధులు కేటాయించి ప్రత్యేకంగా టీటీ శిక్షణా భవనాన్ని నిర్మిస్తోంది.

ప్రస్తుతం శిక్షణ పొందుతున్న 50 మంది

డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న టేబుల్ టెన్నిస్ వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. స్టేడియానికి నిత్యం తర్ఫీదు పొందేందుకు వచ్చే 20 మంది క్రీడాకారులతో పాటు కొత్తగా మరో 30 మంది విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరంలో టీటీ ఓనమాలు నేర్చుకునేందుకు వస్తున్నారు. స్టేడియంలో సీనియర్ కోచ్, వ్యాఖ్యాత ఓలేటి సాంబమూర్తి శిక్షణ నిస్తుండటంతో విద్యార్థులు టీటీ నేర్చుకునేందుకు పోటీ పడుతున్నారు. శిబిరంలో కొత్త క్రీడాకారులకు కోచ్‌తో పాటు సీనియర్ క్రీడాకారులు ఆటలో ఓనమాలు, మెళకువలు నేర్పిస్తున్నారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అలాంటి క్రీడా శిబిరాలను నగరంలో 22, జిల్లాలోని ఇతర గ్రామీణ ప్రాంతాలలో 23 శిబిరాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

నెంబర్ వన్ ర్యాంకులో ఉన్నా... పరిటాల జ్వలిత్, జాతీయస్థాయి క్రీడాకారుడు



నేను టీటీ ఆట నేర్చుకున్న ఇంత తక్కువ కాలంలోనే జాతీయ స్థాయిలో నెంబర్ వన్ ర్యాంకు నా సొంతమవుతుందని కలలో కూడా ఊహించలేదు. పట్టుదలతో కోచ్ నేర్పిన మెళకువలతో ఆటపై పట్టు సాధించా. విద్యార్థులు ఎవరైనా తక్కువ సమయంలో టీటీ ఈజీగా నేర్చుకోవచ్చు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళతాననే నమ్మకం ఉంది.

ఎవరైనా సులభంగా నేర్చుకోవచ్చు

● ఓలేటి సాంబమూర్తి, కోచ్, టీటీ సంఘం జిల్లా కార్యదర్శి



విద్యార్థులు, పెద్దలు ఎవరైనా ఈ ఆటను సులభంగా నేర్చుకోవచ్చు. ఆటపై నియంత్రణ పెంచుకొని క్రమ శిక్షణతో తర్ఫీదు పొందితే విజయం మీవెంటే. చిన్న టేబుల్‌పై పెద్ద ఆట ఆడొచ్చు. టీటీ నేర్చుకోవడం ద్వారా వారిలో శారీరక దృఢత్వం పెంపొంది మానసికంగా ఉల్లాసంగా ఉంటారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఆటలు నేర్చుకోవాలి. విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాలే కాకుండా నిత్యం సాధన చేస్తే ఆటపై మరింత పట్టు సాధించవచ్చు. తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి క్రీడల్లో రాణించే విధంగా చేయాలి. టీటీలో రాణించడం వల్ల ప్రపంచ గుర్తింపు లభిస్తుంది.

శ్రీ ఆంజనేయం

(5వ పేజీ తరువాయి)

సీతారామచంద్రస్వామి వారిని శాసనసభ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు.

ఇరుజిల్లాల్లోని హనుమాన్ ఆలయాల్లో భక్తుల రద్దీ

హనుమాన్ జయంతి వేడుకలను ఇరుజిల్లాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలోని దాసాంజనేయ స్వామి ఆలయం, స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోని హనుమాన్ ఆలయంలో, కాల్వొడ్డు సత్యనారాయణ సహిత వీరాంజనేయాలయంలో, పర్ణశాల రామాలయంలో, ప్రభా టాకీస్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయం, టేకులపల్లి భక్తాంజనేయస్వామి ఆలయం, బల్లేపల్లి రామాలయంలోని ఆంజనేయస్వామితో పాటు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడులో 18అడుగుల పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం టేకులపల్లి భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వీరస్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఖమ్మం దాసాంజనేయస్వామి ఆలయంలో సువర్చలా సహిత హనుమత్ కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.



దీక్షలు విరమిస్తున్న హనుమాన్ భక్తులు



పురవీధుల్లో ఆంజనేయస్వామి ఊరేగింపు దృశ్యం

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

తెలిపారు మధ్యాహ్నం జరిగిన సెకండియర్ తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలకు జనరల్ విద్యార్థులు మొత్తం 841 మందికి గాను 789 మంది, ఒకేషనల్ పరీక్షకు 49 మందికి గాను 40 మంది మొత్తం 890 మందికి 829 మంది హాజరైనట్లు వివరించారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందుగానే చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. సెంటర్ల వద్ద బీఎన్ఎస్ఎస్ 163యాక్ట్‌ను అమలులో ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. 20పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ తనిఖీలు చేశారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డిఐఈవో తెలిపారు.



పరీక్షా కేంద్రం వద్ద సిట్టింగ్ చూసుకుంటున్న ఓ విద్యార్థిని

భద్రాద్రి జిల్లాలో..

చుంచుపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను 24 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ఫస్టియర్ విద్యార్థులు మొత్తం 1547 మందికి గాను 113 మంది, సెకండియర్‌లో 496మందికి 38మంది గైర్హాజరయ్యారు.

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా.. పకడ్బందీగా ఈ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి హెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

అశ్వారావుపేట రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మునిసిపాలిటి పరిధిలోని మారుతినగర్‌లో గురువారం తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. గ్రామంలో మోటారు మరమ్మతులకు గురికావటంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా పూర్తిస్థాయిలో సరిపోవటం లేదు. మోటారు మరమ్మతులు చేసి బుధవారం గంటపాటు నీటిని అధికారులు సరఫరా చేశా రు. అయితే గురువారం తెల్లవారుజామున గాలులకు మరోసారి కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామంలో గురువారం గ్రామంతో తాగునీటి సరఫరా లేకపోవటంతో మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నీరులేక పనులు కూ డా చేసుకోలేకపోతున్నామని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మహిళలతో మాట్లాడారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తామని తెలిపి ఆందోళనను విరమింపజేశారు.



మహిళలతో మాట్లాడుతున్న పోలీసులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

(5వ పేజీ తరువాయి)

సీసీఎల్‌తోపాటు రెవెన్యూశాఖ మంత్రిగా తన పరిధిలో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేసి పర్యవేక్షణ చేయిస్తామని, ఎక్కడా అవినీతి జరగకుండా ఎవరు ఇబ్బందులు ఎదుర్కోకుండా పర్యవేక్షిస్తామని తెలిపారు.

భూ భారతి చట్టం వచ్చిన తర్వాత 33 జిల్లాల్లో 29జిల్లాల్లో ప్రత్యక్షంగా వెళ్లి సదస్సులు నిర్వహించడం జరిగిందని పైలెట్ ప్రాజెక్టు కింద పెట్టిన నాలుగు మండలాలతోపాటు ఇతర జిల్లాల్లో కూడా పర్యటించి ఫిర్యాదులు అడిగి తెలుసుకున్నామన్నారు. జూన్ 3నుంచి 20వరకు 17రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి తహసీల్దార్‌తోపాటు రెవెన్యూ యంత్రాగాన్ని సిద్ధం చేస్తున్నామని, అన్ని గ్రామాల్లో పర్యటించి భూసమస్యలు భూ భారతి చట్టం ద్వారా పరిష్కరిస్తారని తెలిపారు. ఇందిరమ్మ పథకం కింద నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మించబోతుందని, ఇందులో లక్షా90వేలు లబ్ధిదారుల ఎంపికను ఇప్పటికే పూర్తిచేశామన్నారు. మరో 2.50లక్షల మంది లబ్ధిదారుల ఎంపిక కూడా త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. ఐటీడీఏప్రాంతంలోని గిరిజనులకు అదనంగా ఇళ్లు ఇచ్చామని, 9,800 చెంచుల కుటుంబాలకు ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మండలాల్లో ఒక గ్రామపంచాయతీలో మోడల్‌గా తీసుకున్న ఇళ్లకు రూ.లక్ష చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 8వేల కుటుంబాలకు అందించామన్నారు. ప్రతీ సోమవారం ఇళ్లను అప్‌లోడ్ చేసిన వారికి పేమెంట్ రిలీజ్ అవుతుందన్నారు. జూన్ 2న వెయ్యి కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశం చేయనున్నాయని తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల ఇళ్లసమస్యల పరిష్కారం, అక్రిడిటేషన్ల మంజూరుపై ప్రెస్‌అకాడమీ చైర్మన్ తోపాటు యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నామని, త్వరలోనే ఈ సమస్యలను కూడా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

ఆహా ఏమి రుచి..

▸ వేసవి సేద తీరుస్తున్న కొబ్బరి బొండాలు ▸ గోదావరి జిల్లాల నుంచి భారీగా దిగుమతి





ఖమ్మం సాంస్కృతికం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడిమితో పిడుచుకట్టుకుపోతున్న గొంతులకు కొబ్బరి బొండాలు హాయినిస్తున్నాయి.. వేసవి తీవ్రతను ఎదుర్కొనేందుకు కొబ్బరి బొండాలను ఆయుధంగా భావిస్తుండటంతో గత దశాబ్ద కాలంగా వాటి వినియోగం అధికమైంది. జిల్లాలో కొబ్బరి సాగు ఉన్నప్పటికీ దిగుబడి అంతంత మాత్రమే.. మరిరోజుకు దాదాపు నలభై, యాభైవేల వరకు కొబ్బరి బొండాలను ప్రజలు వినియోగిస్తున్నారు.

సుమారు 50వేల బొండాల దిగుమతి

పచ్చదనానికి, పచ్చబంగారానికి ఉభయ గోదావరి, కోనసీమ జిల్లాలు పెట్టింది పేరు.. కొబ్బరి తోటల సాగు, బొండాల పంట దిగుబడి కారణంగా ఆప్రాంతాలకు ప్రకృతి సిద్ధసౌందర్యం దక్కింది.. జిల్లాకు సరిహద్దున ఉన్న పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలనుంచి ప్రతిరోజు ఖమ్మం నగరానికి నలభై వేల నుంచి యాభైవేల కొబ్బరి బొండాలు దిగుమతి అవుతున్నాయి..

హోల్‌సేల్, రిటైల్‌గా..

ఖమ్మం కేంద్రంగా కొబ్బరి బొండాలు రిటైల్‌గానే కాక హోల్ సేల్‌గా జిల్లాలోని పలు ప్రాంతాలకు పొరుగు జిల్లాలకు ఎగుమతి అవుతుండటం విశేషం.. గతంలో ధరల తీరు ఏవిధంగా ఉన్నా ప్రస్తుతం సీజన్ కావడంతో కొబ్బరి బొండాలను రైతుల నుంచి కాయ రూ.25కు కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. రిటైల్‌గా కొబ్బరి బొండాన్ని రూ.40కి విక్రయిస్తున్నా.. ట్రాన్స్‌పోర్టు చార్జీలు, తదితర ఖర్చులు పోను తమకు రిటైల్‌గా ఒకో బొండానికి రూ.3 హోల్ సేల్‌గా రూ.2 వరకు మాత్రమే లాభం ఉంటుందని చెబుతున్నారు.

పోషకాల కోసం..

గతంలో కొబ్బరి బొండాలను అనారోగ్య వంతులకు మాత్రమే అందించేవారు కానీ గత కొన్నేళ్లుగా వీటిని సాధారణ ప్రజలు సైతం వినియోగిస్తున్నారు. కొబ్బరినీళ్లలో ఆరోగ్యాన్ని కలిగించే తక్షణ శక్తిని అందించే ఎలక్ట్రొలైట్ పోషకాలతో పాటు శరీరానికి కాంతినిచ్చే సౌందర్య గుణాలు ఉన్నాయని భావిస్తుండటం వల్ల ఆరోగ్యవంతులు సైతం కొబ్బరి నీళ్లను తాగుతున్నారు. ఎండ తీవ్రత కారణంగా డీహైడ్రేషన్‌కు గురైన వారు, జీర్ణక్రియ రుగ్మతలు ఉన్నవారు అధికంగా కొబ్బరి నీళ్లను ఆశ్రయిస్తున్నారు. వినియోగదారుల డిమాండ్ రోజు రోజుకూ అధికం అవుతుండటంతో ఉభయ గోదావరి జిల్లాలనుంచి భారీ ఎత్తున సరుకు దిగుమతి అవుతోంది.

ఉభయ గోదారి జిల్లాల్లోని జంగారెడ్డి గూడెం, ఏలూరు, చింతలపుడి, టి. నర్సాపురం, గుర్రంపాలెం, శ్రీనివాసమంగాపురం, రాజమండ్రి, తదితర ప్రాంతాల నుంచి లారీలద్వారా కొబ్బరి బొండాలు దిగుమతి అవుతున్నాయి. రోజుకు దాదాపు పదిహేను లారీల వరకు సరుకు నగరానికి చేరుతోంది..

నగరానికి కొబ్బరి కళ..

నగర వ్యాప్తంగా అన్ని సెంటర్లలో కొబ్బరి బొండాల దుకాణాలు, నగరంలో పలు చోట్ల హోల్ సేల్ దుకాణాలతో కొబ్బరి బొండాల వ్యాపారం కళకళలాడుతోంది.. కొబ్బరి కాయ ల ఉపయోగం విస్తృతం కావడంతో వాటి అర్థం మారిపోయింది. గతంలో దేవునికి మొక్కులు సమర్పించేందుకు మాత్రమే కొబ్బరి కాయలను వినియోగించేవారు లేదా అనారోగ్యానికి గురైన వారు, ఎండ దెబ్బబారిన పడినవారు మాత్రమే కొబ్బరినీళ్లను సేవించేవారు. కాగా అందానికి, ఆరోగ్యానికీ కొబ్బరినీళ్లు అనే అభిప్రాయం అధికం కావడంతో కొబ్బరి బొండాలకు డిమాండ్ అధికం అయ్యింది.. నగరం కేంద్రంగా దిగుమతి అవుతున్నప్పటికీ ఇక్కడి నుంచి మరలా జిల్లా వ్యాప్తంగా, పరిసర వరంగల్, నల్గొండ జిల్లాలకు ఎగుమతి అవుతుండటం గమనార్హం.. ప్రతి రోజు స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద కొబ్బరి బొండాల వ్యాపారాలు కొనసాగుతున్నాయి.

లాభం అంతగా ఉండదు..

పారా సత్యనారాయణ, కొబ్బరి బొండాల హోల్‌సేల్ వ్యాపారి

ఖమ్మం నగరానికి ప్రతిరోజు పదిపన్నెండు లారీల కొబ్బరి బొండాలు దిగుమతి అవుతున్నాయి.. కొబ్బరి కాయలను తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి తీసుకువస్తాము. వేల సంఖ్యలో కొబ్బరి బొండాల దిగుమతి అవుతున్నప్పటికీ రవాణా ఖర్చులు, ఇతర ఖర్చు లు, తదితరాల వల్ల దిగుమతి దార్లకు పెద్దగా మిగిలేది ఏమీ ఉండదు.. తోటల వద్ద ఒకో కాయ రూ.25 నుంచి 28వరకు పడుతోంది. ఖర్చులు పోను ఒక్కో బొండానికి రిటైల్‌గా రూ.3, హోల్ సేల్ గా ఒకటి రెండు రూపాయలకు మించి లాభం ఉండదు.

26నుంచి సర్వేయర్లకు శిక్షణ

▸ కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు భూమిని సర్వే చేసేందుకు లైసెన్స్ సర్వేయర్లుగా ఎంపికైన 426 మందికి ఈనెల 26నుంచి జులై 26వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ జితేష్ విపాటిల్ తెలిపారు. గురువారం కొత్తగూడెం మైనింగ్ కళాశాలలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ కళాశాలలో తరగతి గదులు, డ్రాయింగ్ రూంలను పరిశీలించారు. జిల్లాలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు 50రోజుల పని దినాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కోసం అవసరమైన ప్రొజెక్టర్లు, బోర్డులు, పరికరాలను ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మైనింగ్ కళాశాలల ఏడీ శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాస్, మైనింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి సేవలు చిరస్మరణీయం

దళిత, వైతాళికులు, సంఘ సంస్కర్త ఎంవీ. భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన జీవితం భావితరాలకు ఆదర్శం అని కలెక్టర్ జితేష్ విపాటిల్ కొనియాడారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడీవోసీ కార్యాలయంలో సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీవో సంజీవరావు, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి అనసూయ, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, ఏవో రామకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో జయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు భద్రాద్రి జిల్లా జట్టు



బాక్సింగ్ క్రీడాకారులతో కామేష్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు ఎంపిక చేసినట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ యెర్రా కామేష్ తెలిపారు. ఎంపికైన వారు శనివారం నుంచి 27వ తేదీ వరకు మంచిర్యాల జిల్లాలో జరుగనున్న టైసన్ కప్ ఓపెన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జరిగే బాక్సింగ్ పోటీలలో సబ్ జూనియర్స్ విభాగం నుంచి గోనెల నిశాంత్‌కుమార్, దాసరి హేమంత్, రాచకట్ల వినయ్, బొల్లోజు మహే ష్, ఆముదాల విజయ్‌భాగ్యేష్, జూనియర్ విభాగం నుంచి జిజుల అజిత్, గోనెల అక్షయ్‌కుమార్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ జిల్లా జనరల్ సెక్రటరీ వై.శివ, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు, నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షమీఉద్దీన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ రాజా, యెర్రా ధనుంజయ్, సుహాష్, అద్వైత్, నున్న శివచౌదరి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం మైనారిటీల కోసం ప్రత్యేకంగా స్థాపించిన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్) ద్వారా 2025-26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి పురందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 8 మైనారిటీ విద్యా సంస్థలు ఉన్నాయని తెలిపారు. 2025 మే 31తో అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తుందని పేర్కొన్నారు. 5వ తరగతి అన్ని పాఠశాలలో అందుబాటులో ఉందని తెలిపారు. 6 నుంచి 9, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీలలో ఎంపికలు జరుగుతున్నట్లు తెలిపారు.

కళాశాల వివరాలు

ఖమ్మం బాలికలు-1 శారదా ఇంజనీరింగ్ కళాశాల రఘునాథపాలెం 8331847614, ఖమ్మం బాలురు-1 పులిపాటి ప్రసాద్ ఇంజనీరింగ్ కళాశాల కొణిజర్ల 8106971907, సత్తుపల్లి బాలురు-1 గుడిపాడు రోడ్ సత్తుపల్లి 9848893940, ఖమ్మం బాలికలు-2 అల్లీపురం 9441309459, నేలకొండపల్లి బాలురు-1 జలగంనగర్ 9701968666, వైరా బాలికలు-1 ఎస్ఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సింగరేణి 9704149212, మధిర బాలురు-1 జీలుగుమాడు గ్రామం 9640445923, టీఎంఆర్జేసీ ఖమ్మం బాలికలు-1 రాపర్తినగర్ 9154365017 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు

▸ డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.కళావతిబాయి హెచ్చరించారు. గురువారం ఆమె తన కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల చట్టం (1994)అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్లు, ఇమేజింగ్ సెంటర్లు కూడా పీసీపీ ఎన్డీటీ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకొని, చట్టం సూచించిన నిబంధనల ప్రకారం డయాగ్నోస్టిక్ సెంటర్లను నిర్వహించాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవని తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో కొత్తగా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రోగ్రాం అధికారి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి, ఆన్‌లైన్ దరఖాస్తును పరిశీలించి చెక్ లిస్ట్ ద్వారా రికార్డులు, రిజిస్టర్లు, స్కానింగ్ మిషన్ వివరాలు, సర్టిఫైడ్ క్వాలిఫైడ్ డాక్టర్ల డాక్యుమెంట్స్, ఓనర్ డాక్యుమెంట్స్ అన్నీ వివరంగా పరిశీలించిన తర్వాతే పీసీపీఎన్డీటీ చట్టం జిల్లా మల్టీ మెంబర్ కమిటీ చైర్ పర్సన్ కలెక్టర్ అనుమతితో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేసినవారికి, చేయించినవారికి, ప్రోత్సహించిన వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. ఆడపిల్లను స్వేచ్ఛగా పుట్టేలా, పెరిగేలా, స్వయం శక్తితో ఎదిగేలా నైతిక బాధ్యతతో వ్యవహరించాలని, మానవతా దృక్పథంతో ఆడపిల్లను రక్షించడానికి ప్రతిజ్ఞ చేద్దామని డీఎంహెచ్‌వో పిలుపునిచ్చారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సైదులు, డాక్టర్ సీతారాం, గైనకాలజిస్ట్ డాక్టర్ యామిని, డెమో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ డెమో సాంబశివరెడ్డి తదితరులు న్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి

▸ ఇల్లెందులో ప్రజా సంఘాల నిరసన



ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఇల్లెందు, మే22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని ఆదివాసీలను అమానుషంగా హత్యలు చేస్తున్నారని పలువురు నాయకులు అన్నారు.ఀన గురువారం తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు రామటెంకి అశోక్ నేతృత్వంలో ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ మెంతెన సంజీవరావు, తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, న్యూడెమోక్రసీ డివిజన్ సహాయ కార్యదర్శి సారంగపాణి, చైతన్య మహిళాసంఘం నాయకురాలు కొప్పుల గీతారెడ్డి, ఆదివాసీ సంఘీభావ వేదిక జిల్లా కన్వీనర్ మెంతెన ప్రభాకర్ మాట్లాడుతూ దోపిడి పీడనలు లేని సమసమాజాన్ని స్థాపించడానికి దేశంలో ప్రజల ప్రాథమిక హక్కులు జీవించే హక్కులు కాపాడేందుకు ఐదు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేసిన మావోయిస్టు అగ్రనేత బస్వరాజ్ మరణం అన్ని వర్గాల ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ లాంటి శత్రుదేశాలతో చర్చలు జరుపుతున్న కేంద్రప్రభుత్వం భారత దేశ ఆదివాసీ ప్రజలతో నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు నేతలతో చర్చలు ఎందుకు జరపడం లేదని నిలదీశారు. ఈ నిరసన కార్యక్రమంలో టీపీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎట్టి ప్రశాంత్, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వట్టం కన్నయ్య, న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి ఎండి.రాసుద్దీన్, న్యూడెమోక్రసీ నాయకులు యాకన్న, తుడుందెబ్బ జిల్లా నాయకులు సూర్నపాక రామారావు, ఈసం కృష్ణ, లక్‌పతి, మిట్టపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక దందా

▸ ఆంధ్రా నుంచి సత్తుపల్లి నియోజకవర్గంలోకి కొనసాగుతున్న అక్రమ రవాణా



సత్తుపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి సత్తుపల్లి నియోజకవర్గంలోని మండలాలకు ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఒక పక్క అధికారులు ఆంధ్రా నుంచి వస్తున్న ఇసుక లారీలను పట్టుకుంటున్నప్పటికీ అక్రమ వ్యాపారులు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. జరిమానా కట్టి మరలా తమ దందా కొనసాగిస్తున్నారు. తాజాగా బుధవారం పెనుబల్లి మండలంలోని లంకాసాగర్‌లో ఆంధ్రా నుంచి వచ్చిన రెండు ఇసుక లారీలను స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం వేంసూరులో పోలీసులు ఇసుక లారీ పట్టుబడిన విషయం విదితమే.

ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ఇసుక వ్యాపారులు, సత్తుపల్లి పట్టణానికి చెందిన కొందరు ఇసుక అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుక అక్రమంగా సత్తుపల్లి నియోజకవర్గంలోని పలు మండలాల్లో జరుగుతున్న అక్రమ వ్యాపారం పై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించిన విషయం విదితమే. జిల్లా అధికారులు, రాష్ట్ర స్థాయిలో కొందరు ఉన్నతాధికారుల ఇసుక అక్రమ రవాణా, వ్యాపారంపై స్థానిక అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ఇటీవల ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెరిగింది. అయినప్పటికీ ఇసుకను అధికారుల కన్నుగప్పి పలు రహదారుల్లో సత్తుపల్లి నియోజకవర్గానికి తరలిస్తున్నారు. గత కొంత కాలంగా ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరు మండలం దొండపూడి ఇసుక రేవు నుంచి ఇసుకను ఈ ప్రాంతానికి గత కొంత కాలంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను అధికారులు పట్టుకున్న సందర్భంలో డ్రైవర్ చెప్పినట్లు పంచనామాలె రైడా నమోదైంది. దీనిని బట్టి అక్రమ రవాణా కొంత కాలంగా యథేచ్ఛగా జరుగుతోందనేది స్పష్టమవుతోంది. ఇసుక లారీ పట్టుబడిన సందర్భంలో సదరు లారీ యజమానులు గుడి నిర్మాణానికి లేదా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు అంటూ అధికారులను మభ్యపెట్టే ప్రయత్న చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల సత్తుపల్లికి చెందిన ఒక లారీ యజమాని ఆంధ్రా నుంచి ఇసుక అక్రమంగా సత్తుపల్లికి తరలించగా, గుడి నిర్మాణం కోసం అంటూ అధికారులకు చెప్పి, పలుకుబడి కలిగిన వ్యక్తులతో పైరవీలు చేయించినట్లు ప్రచారం జరిగింది.

ప్రతీ మండలంలో ఏజెంట్లు...

ఆంధ్రా నుంచి సరిహద్దున ఉన్న సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాలకు ఇసుక అక్రమంగా రవాణా జరుగుతోందని ఆరోపణలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని లారీ, టిప్పర్ యజమానులు ఈ ప్రాంతంలోని మండలాల్లో ఏజంట్లను నియమించుకొని ఇసుక అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. స్థానికంగా పలుకుబడి కలిగి ఉన్న వారు ఆర్థిక లావాదేవీలు చేయగలిగిన వారిని ఏజంట్లుగా ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే పెనుబల్లి మండలంలో పట్టుబడిన రెండు ఇసుక లారీలకు సంబంధించి ఈ మండలానికి చెందిన వారి పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఒక పక్క అధికారులు దాడులు చేస్తున్నా అక్రమార్కులు కూడా తగ్గేదేలే అంటు ఇసుక రవాణా చేస్తున్నారు.

ఇసుక వాహనాలకు ముందు పైలెట్లు

ఆంధ్రప్రదేశ్ నుంచి సత్తుపల్లి నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో ఇసుక అక్రమంగా జరుగుతున్న క్రమంలో నిఘా పెరిగింది. దీంతో ఇసుక వాహనాలకు ముందు కార్లు, ద్విచక్రవాహనంపై కొందరు వ్యక్తులు పైలెట్లుగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఇసుక వాహనానికి కనీసం కిలోమీటరు ముందుగా వెళ్లి అధికారుల తనిఖీలు జరగడం లేదని లారీ డ్రైవర్‌కు సమాచారం ఇచ్చిన తరువాత సదరు లారీ లేదా టిప్పర్ గమ్యం చేరుతోందని అంటున్నారు.

కల్వర్టును ఢీకొని లారీ డ్రైవర్ మృతి

బూర్గంపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : కల్వర్టుని లారీ ఢీకొట్టిన ఘటనలో లారీ డ్రైవరు మృతి చెందిన విషాద సంఘటన సారపాకలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా చిట్యాల మండలం నేరెడ గ్రామానికి చెందిన ఐతరాజు నరేష్(35) కంటైనర్ లారీలో పేలుడు పదార్థాల లోడుతో ఒడిశా వెళుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం సారపాక సంత సమీపంలో ఎదురుగా ఉన్న ట్రాకర్‌ను తప్పించబోయి జాతీయ రహదారి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో నరేష్ లారీ క్యాబిన్లో ఇరుక్కుపోయాడు. స్థానికులు అతడిని బయటకు తీసి భద్రాచలం ఆస్పత్రి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ సతీష్‌కుమార్, పాల్వంచ సీఐ సతీష్‌కుమార్ పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు.

చికిత్స పొందుతూ యువకుడు..



మహేష్(ఫైల్)

వైరా, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తాటిపూడి గ్రామంలో చోటు చేసుకుంది. తాటిపూడి గ్రామానికి చెందిన దుగ్గిరాల మహేష్(18)వైరా-జగ్గయ్యపేట, మధిర ప్రధాన రహదారిపై ఈనెల 17న తన ద్వి చక్ర వాహనం పంక్చర్ కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కనుంచి నడిపించుకుంటూ వెళ్తుండగా అదే సమయంలో వైరా నుంచి జగ్గయ్యపేట వెళ్తున్న డీసీఎం వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నాటి నుంచి కోమాలోనే ఉన్న మహేష్ బుధవారం రాత్రి మృతిచెందాడు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అశ్వారావుపేటలో గురువారం జరిగింది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని దండాబత్తుల వీధిలో నివాసం ఉంటున్న వరుకూటి వెంకన్నబాబు(32) కొంతకాలంగా ఏపని లేక ఖాళీగా ఉంటున్నాడు. దీంతో కుటుంబపోషణ భారంగా మారింది. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గురువారం తెల్లవారుజామున గడ్డిమందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు అశ్వారావుపేటలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకన్నబాబు మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కొత్తగూడెం డీఎస్పీకి ప్రశంసా పత్రం



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే22(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. పోలీస్‌శాఖలోని వివిధ విభాగాలలో పని చేస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. అందులో భాగంగా కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ పోక్సో కేసులలో త్వరతగతిన దర్యాప్తు పూర్తి చేసి, కేసుల పరిష్కారానికి కృషి చేసినందుకుగాను ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు గురువారం ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రెహమాన్‌ను అభినందించారు.

దేవస్థానంలో ఐదుగురికి మెమోలు!

భద్రాచలం, మే 22 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఒక కీలక అధికారితో పాటు మరో నలుగురికి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి మెమోలు జారీ చేసినట్లు సమాచారం. హనుమజ్జయంతి సమయాన ఏకాంత విశేష స్నపనం తరువాత సహస్రనామార్చన నిర్వహించకపోవడంతో ఇద్దరు వైదిక సిబ్బందికి మెమోలు గురువారం జారీ చేసినట్లు దేవస్థానం వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే హనుమాన్ భక్తులు భారీగా తరలివచ్చిన క్రమంలో సహస్రనామార్చన నిర్వహించలేకపోయామని పేర్కొన్న వైదిక సిబ్బంది, సాయంత్రం సహస్రనామార్చన నిర్వహించినట్లు వినికిడి. అలాగే దేవస్థానంలో ఓ కీలక అధికారితో పాటు మరో ఉద్యోగికి మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. ఆడిట్, ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కలు సకాలంలో పూర్తి చేయకపోవ డం, ఇతరత్రా అంశాల ఆధారంగా మెమోలు జారీ అయినట్లు వినికిడి. ఇదిలా ఉండగా నాలుగో తరగతికి ఉద్యోగిని ఉద్యోగ విరమణ విషయంలో వ్యవహరించిన తీరుపై ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది.

సారా విక్రేత అరెస్టు

పినపాక, మే 22 (ఆంధ్రజ్యోతి): పినపాక మండలం జానంపేట గ్రామ శివారులో ఎక్సైజ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా రావడంతో అతడిని తనిఖీ చేశారు. మండలంలోని దుగినేపల్లి గ్రామానికి చెందిన భూక్యా రామారావుగా గుర్తించారు. అతని వద్ద 8 లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. సారా విక్రయానికి ఉపయోగించే ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రాజిరెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు శ్రీను, ఆంజనేయులు, సతీష్ ప్రసన్న కుమార్‌లు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి జింక



అశ్వారావుపేట, మే 22(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో బుధవారం అడవిలో నుంచి దారి తప్పి పట్టణంలోని జనావాసాల్లోకి జొరబడింది. జింకను చూసిన పట్టణవాసులు, కొందరు జింకను ఫొటో తీసే ప్రయత్నం చేశారు. అయితే జనాన్ని, పట్టణంలోని వాహనాల రణగొణధ్వనులను చూసి జింక బెదిరి పోయి చంగు చంగున పరుగులు పెట్టింది. అటవీ అధికారులు వలతో పట్టుకునే ప్రయత్నం చేసిన వారికి అది పట్టుబడలేదు. తప్పించుకొని అల్లిగూడెం అటవీ ప్రాంతంలోకి జింక పారిపోయింది.



'సెటా' జిల్లా అధ్యక్షుడిగా మారగాని




లక్ష్మీనారాయణ,శ్రావణి

నేలకొండపల్లి,మే22(ఆంధ్రజ్యోతి): సెటా(స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్)జిల్లా అధ్యక్షుడిగా మారగాని లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా కోనేసి శ్రావణి నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ప్రత్యేక ఉపాధ్యాయుల సమావేశంలో ఈఎన్నిక జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాల కోసం కృషి చేస్తానన్నారు. సమావేశంలో రాష్ట్రకమిటీ సభ్యుడు శివకుమార్, రవికుమార్, ఉపాధ్యక్షులు వీరన్న, సంయుక్త కార్యదర్శి నరేష్, కోశాధికారి సూరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

- మేయర్ పునుకొల్లు నీరజ
- ఖానాపురం అండర్ డ్రెయినేజీ పనుల పరిశీలన



కూల్చివేత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మేయర్

ఖమ్మంసంక్షేమ విభాగం, మే22(ఆంధ్ర జ్యోతి): నగరాన్ని విపత్తులను ఎదుర్కొనే నగరంగాఅభివృద్ధి చేస్తున్నామని అందుకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని మేయర్ పునుకొల్లు నీరజ కోరారు. గురువారం ఖానాపురం అలుగు సమీపంలోని అండర్ డ్రెయినేజీ పనులను మేయర్ పునుకొల్లు నీరజ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గతేడాది కురిసిన వర్షాలకు మైదాన ప్రాంతంలోని 6,10,11,14,41 డివిజన్లు ముంపునకు గురైనాయన్నారు. విపత్తులను ఎదుర్కొనేందుకు అలుగును వెడల్పు చేయటంతో పాటుగా అండర్‌డ్రెయినేజీ వ్యవస్థకు రూ.250 కోట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంజూరు చేయించారని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తుల ఇళ్ల స్థలాలు, ఇళ్లు కోల్పోతున్నారని, బాధితులు సహకరిస్తే వర్షాకాలం లోపుగా ఖానాపురం అలుగుతో పాటుగా అండర్ డ్రెయినేజీ నిర్మాణం పూర్తి జరుగుతుందన్నారు. స్థానిక కార్పొరేటర్ సరికొండ రమాదేవి, నాయకులు సరిపుడి సతీష్ వెంటున్నారు. స్థానిక ప్రజల సూచనల మేరకు పలు సూచనలు చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంరూరల్,మే22(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూగృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముత్తగూడెం నుండి తిరుమలాయపాలెం, తాళ్లేసితండా వరకు నిర్మించనున్న రెండు వరుసల రోడ్డుకు, ఎస్‌ఎస్పీకెనాల్‌పై హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు, ఎంవిపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో అదనపుగదుల నిర్మాణానికి, పొన్నేకల్లు నుంచి పిట్టలవారిగూడెం రోడ్డు రెండు వరుసల రోడ్డు పనులకు, చింతపల్లి నుంచి కాచిరాజుగూడెం వరకు రోడ్డును రెండు వరుసల రహదారి అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్‌అండ్‌బి ఎస్‌ఇ యాకూబ్, ఆర్డీవో నరసింహరావు, ప్రత్యేకాధికారి రమేష్, తహసీల్దార్ రాంప్రసాద్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు, బండి జగదీష్, మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, కిషోర్‌రెడ్డి, వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలందాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ఖమ్మంకలెక్టరేట్, మే22(ఆంధ్రజ్యోతి): రోగులను నాణ్యమైన వైద్యసేవలు అందించాలని... వైద్యులు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బి.కళావతిబాయి అన్నారు. గురువారం ఖమ్మం అర్బన్ రంగనాయకుల గుట్ట బస్తీదవాఖానాను తనిఖీ చేశారు. ఓపీ సేవలను పరిశీలించారు. ఉదయం 9 గంటల నుంచి సాయింత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలన్నారు. రోగుల పట్ల మర్యాదగా ఉండాలన్నారు. అసంక్రమిత వ్యాధుల పట్ల అందరికి అవగాహన కల్పించాలని సూచించారు. సీజన్ వస్తున్న నేపథ్యంలో మలేరియ, డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉంచాలన్నారు. క్యాన్సర్, మధుమేహం, హైపర్ టెన్షన్, టీబీ వ్యాధిగ్రస్థులకు కూడా సేవలు అందించి, కౌన్సిలింగ్ నిర్వహించి ఆరోగ్యవిద్యను అందించాలన్నారు. విధులపట్ల నిర్లక్ష్యం వద్దని హెచ్చరించారు.

ఘనంగా హనుమజ్జయంతి

భారీగా హాజరైన భక్తులు

హనుమాన్ చాలీసా పారాయణం



ఎస్పీ ఆఫీస్‌రోడ్డులో భక్తులు



దాసాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



బైరాగుల గుట్ట ఆలయంలో అన్నదానం



రామక్రిష్ణాపురంలో హనుమాన్ చాలీసా పారాయణం

ఖమ్మంఖానాపురంహవేలి,మే22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు ఆలయాలలో ప్రత్యేకంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వంచారు.టేకులపల్లి భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం. వీరస్వామి కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలో వీడియోస్ కాలనీ అభయవెంకటేశ్వరనగర్‌లోని అభయవెంకటేశ్వరస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. 36వ డివిజన్ పీసీకే తోటలోని స్వయంభు పంచముఖ బాలలాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పుస్తకాలను అందించారు. కాల్వొడ్డులోని సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఉదయం లక్ష తమలపత్రపూజ నిర్వహించారు. సాయంత్రం ప్రముఖ హరికథకులు వనం. వెంకట వరప్రసాద్‌చే పురాణ కాలక్షేపం(హనుమాత్ వైభవం) వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. దాసాంజనేయస్వామి ఆలయంలో సువర్చలా సహిత హనుమత్ కల్యాణం నిర్వహించారు.

నేలకొండపల్లి: శ్రీహనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామాలయాలు, హనుమత్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నేలకొండపల్లిలోని బైరాగుల గుట్ట వద్దనున్న శ్రీప్రసన్నాంజనేయస్వామిఆలయంలో వేల్పుల సత్యనారాయణ, పార్వతిల జ్ఞాపకార్థం వారి కుమారులు గోపినాథ్, జీబీఆర్‌కే ప్రసాద్, బొల్లు శ్రీనివాసరావు 1000మందికి అన్నసంతర్పణ చేశారు. సింగారెడ్డిపాలెం శ్రీరామ మందిరంలో చిన్నారులు 41సార్లు హనుమాన్ చాలీసా పఠించారు. కార్యక్రమంలో అక్కినేని నాగేశ్వరరావు, పాలడుగు రామకృష్ణ, కొడాలి భాస్కరరావు, రాయపూడి కాంతారావు, అక్కినేని లక్ష్మి, చవలం భువన, కొల్లి అన్నపూర్ణ, మద్దినేని పద్మ, గెల్లా సువర్ణ తదితరులు పాల్గొన్నారు. కొత్తకొత్తూరులోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతిని వైభవంగా జరిపారు. అర్చకుడు పంతంగి పవన్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

కామేపల్లి: శ్రీఅభయవెంకటేశ్వర స్వామి దేవాలయాలలో భక్తులు పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. కామేపల్లి రామక్రిష్ణపురంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమరనేని వెంకటేశ్వర్లు, జర్పల రామారావు, బాగం రంగారావు, హనుమాన్ చాలీసా భక్త మండల కన్వీనర్ భైరోజు శ్రీనివాసచారీ, పోలోజు పూర్ణాచారీ, నర్సింహరావు, పెరుగు మల్లయ్య ఉన్నారు.




దాసాంజనేయస్వామి, జలాంజనేయస్వామి



గుట్ట ఆలయంలో..



జలాంజనేయ స్వామి ఆలయంలో పూజలు



సింగారెడ్డిపాలెంలో పూజలు చేస్తున్న మహిళలు

ట్రాక్టర్లలోనే విప్లవాత్మకం జాన్‌డీర్

- వీవీసీ మోటార్స్ ఆధ్వర్యంలో ఒకేరోజు మూడు షోరూంలు
- ప్రారంభించిన ఎండీ రాజేంద్రప్రసాద్, జాన్‌డీఆర్ నిర్వాహకుడు రమాకాంత్



విజయకేతనం చూపుతున్న ఎండీ రాజా, రమాకాంత్

ఖమ్మంసంక్షేమవిభాగం,మే22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో జాన్‌డీర్ ట్రాక్టర్ కంపెనీ అమ్మకాల్లో నెంబర్1 స్థానాన్ని కొనసాగిస్తుందని వీవీసీ మోటారు సంస్థల ఎండీ వంకాయలపాటి రాజాంద్రప్రసాద్(రాజా), జాన్‌డీఆర్ కంపెనీ నిర్వహకుడు రమాకాంత్ పేర్కొన్నారు. గురువారం ఖమ్మం, తల్లాడ, కోదాడలో జాన్‌డీర్ నూతన షోరూమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమాకాంత్, రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జాన్‌డీర్‌ట్రాక్టర్లు వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో ట్రాక్టర్ నిర్వాహణ వ్యయం గణనీయంగా తగ్గిందన్నారు. టైర్లు,బ్రేక్‌లు,క్లచ్,ఇతరభాగాలు నిర్వహణ తగ్గిందన్నారు. ఐదేళ్లవరకు పూర్తిగ్యారెంటీ ఇవ్వటం జరుగుతుందన్నారు. త్వరలో గేర్‌లేస్ ట్రాక్టర్ అందుబాటులోకి వస్తుందన్నారు. వీవీసీ మోటార్స్ ఆధ్వర్యంలో గడిచిన 25ఏళ్లలో25వేల ట్రాక్టర్లును ఉమ్మడిఖమ్మం,నల్గొండ జిల్లాలో వీవీసీ మోటార్స్ ఆధ్వర్యంలో అమ్మకాలు జరిపామన్నారు. ఉమ్మడి ఖమ్మం,నల్గొండ జిల్లాలో నెలకు మూడు వేల ట్రాక్టర్లు అమ్మకాలు జరుపుతున్నామన్నారు.

'అమృత్ మిత్రాల'కు కిట్లు పంపిణీ

ఖమ్మంసంక్షేమవిభాగం, మే22(ఆంధ్ర జ్యోతి): మొక్కల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన మృత్‌మిత్రాలకు గురువారం కిట్లు పంపిణీ చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ వీటిని అందజేశారు. గురువారం ఖమ్మం నగరంలోని డంపింగ్‌యార్డులోరెండు ప్రాంతాల్లో, ఫ్రీడమ్ పార్కులో మొక్కల కోసం మహిళ కార్యక్రమంలో స్థల పరిశీలన చేశారు. ఎంపిక చేసిన శ్రీరామ, భవాని, శ్రీ వెన్నెల అమృత్‌మిత్రాలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్లు బందె నిరంజన్, పగడాల శ్రీవిద్య, కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక, డీఎంసీ సావల సుజాత, ఏడీఎంసీ వెంకటేశ్వరరావు, సీవో ద్రౌపది, సిబ్బంది మేకల సంధ్య, ఆర్పీలు అలివేలు, అరుణ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్వో శ్రీధర్

ఖమ్మంసంక్షేమవిభాగం, మే22 (ఆంధ్ర జ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారిగా శ్రీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఆర్వో శ్రీనివాసరావుకు మహబూబాబాద్ మునిసిపాలిటీకి బదిలీ కాగా అక్కడ మేనేజరుగా పనిచేస్తున్న శ్రీధర్‌ను ఖమ్మానికి ఆర్వోగా బదిలీ చేశారు. దీంతో గురువారం శ్రీధర్ కేఎంసీలో బాధ్యతలు స్వీకరించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యను మర్యాదపూర్వంగా కలిశారు. అలాగే సత్తుపల్లి మున్సిపాలిటీ నుంచి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు కేఎంసీలో జాయిన్ అయ్యారు. వీరిని సహచరు ఉద్యోగులు అభినందించారు.

ఉపాధ్యాయ శిక్షణ పరిశీలన

ఖమ్మంఖానాపురంహవేలి,మే22 (ఆంధ్ర జ్యోతి): నగంలోని న్యూఇరా పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యా శిక్షణ శిబిరాన్ని గురువారం రాష్ట్ర తెలుగు శిక్షణ పర్యవేక్షకుడు ఎం. భాస్కర్ సందర్శించారు. శిక్షణ తీరును పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సత్యనారాయణ ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ అన్ని మౌళిక వసతులు కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రామకృష్ణ, ఆర్పీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి

నేలకొండపల్లి, మే22(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటును వెంటనే చేయాలని, కులగణనలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రావల్సిన రెమ్యూనరేషన్‌ను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తేజావత్ వెంగళరావు డిమాండ్ చేసారు. గురువారం నేలకొండపల్లిలో మండల అధ్యక్షుడు తేజావత్ గోవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంగళరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్దుబాటులో ఉన్న ఉపాధ్యాయులను నేటికీ వారి మాతృ స్థానాలకు పంపకపోవటం విచారకరమన్నారు. దీంతో ఒక పాఠశాలలో ఒక సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులున్నారన్నారు. గత సంవత్సరం నవంబరులో కుల గణనలో పాల్గొన్న ఉపాధ్యాయులకు నేటికీ రెమ్యూనరేషన్‌ను ఇవ్వలేదని, రెమ్యూనరేషన్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో బి.నాగేశ్వరరావు, సురేష్, కోటేశ్వరరావు, వీరబాబు, జ్యోతిర్మయి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర చెట్టు తొలగింపు



ఖమ్మం సంక్షేమ విభాగం, మే 22(ఆంధ్ర జ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలోని డీఆర్‌ఎఫ్ బృందాలు సాహసోపేతంగా పనిచేసి స్థానికుల మన్ననలు పొందారు. 16వ డివిజన్‌లో కొబ్బరిచెట్టు 30అడుగులకు పైగా ఎత్తుకు పెరిగింది. సమీపంలో ఉన్న నివాసాలపై పడే పరిస్థితి వచ్చింది. గాలిదుమారం వచ్చిన ప్రతిసారి స్థానికులు భయపడేవారు. కాగా స్థానిక కార్పొరేటర్ కమర్తపు మురళి సమాచారంతో కేఎంసీ డీఆర్‌ఎఫ్ బలగాలు శుక్రవారం ప్రమాదకరంగా ఉన్న చెట్టును లేడర్ మిషన్‌తో సహసోపేతంగా కట్ చేశారు. ముక్కలు ఇళ్లపై పడకుండా చర్యలు తీసుకున్నారు. డీఆర్‌ఎఫ్ బృందం పిట్టల బాబురావు, నారపొంగు వీరబాబు, రామకృష్ణ, విజయ్,లక్ష్మణ్‌ను స్థానికులు అభినందించారు.

ఉద్యాన పంటలకు రాయితీ

ఖమ్మంరూరల్,మే22(ఆంధ్ర జ్యోతి): ఉద్యాన పంటలకు ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాలేరు డివిజన్ ఉద్యాన అధికారి పి.అపర్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పండ్లతోటలు వేసుకునే వారి 40శాతంరాయితీ, కూరగాయలు మరియు మిరప మల్చింగ్‌తో సాగుకు 50 శాతం రాయితీ, బ్రష్‌కటర్స్ మరియు పవర్ వీడర్స్‌కు 40శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కూరగాయల సాగులో భాగంగా రాయితీలో మొక్కలు ఇస్తున్నట్లు చెప్పారు. 75శాతం రాయితీతో తుంపర సేద్య పరికరాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.కూరగాయల సాగు కోసం శాశ్వత పందిరి వేసుకునే వారికి 50శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు.

నాలాలపై అక్రమ నిర్మాణాలు తొలగించాలి

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



స్థల పరిశీలన చేస్తున్న కమిషనర్

ఖమ్మంసంక్షేమవిభాగం, మే22 (ఆంధ్ర జ్యోతి): మున్నేరు పరివాహకంలోని నాలాలు ఆక్రమణలు తక్షణమే తొలగించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధరను ఆదేశించారు. గురువారం 46వ డివిజన్‌తో పాటుగా మున్నేరు పరివాహక ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. మున్నేరు నాలాలపై అక్రమ నిర్మాణాలను గుర్తించారు. అలాగే 46వ డివిజన్‌లో అంగన్వాడీ కేంద్రానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కన్నం వైష్ణవి మాట్లాడుతూ స్థానిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మున్నేరు లోతట్టు ప్రాంతంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, జూబ్లీపుర ప్రాంతంలోని మురుగు కాల్వలో గ్యాంగ్ వర్క్ నిర్వహించి సిల్ట్ తొలగించాలని కోరారు. వెంటనే పనులు ప్రారంబించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

సైనికులకు ఆర్థికం సాయం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఖమ్మంరూరల్, మే22(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన సైనికుల సహాయార్థం ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు గురువారం అందజేశారు. దేశంమీద ఉన్న గౌరవంతో కొంతమంది వారి యొక్క వ్యక్తిగతంగా తలా కొంత, సంఘం తరుపున కొంత నగదు జమచేసి భారతసైనిక సహాయార్థం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహదారు నరేందర్, కిషన్, ఎస్‌కే జానీ, వెంపటి వెంకటేశ్వర్లు, రఘు, గోవిందు, భద్రం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలి

ఖమ్మంఖానాపురంహవేలిమే22(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటి డిమాండ్ చేసింది. గురువారం జిల్లా విద్యాశాఅధికారి కె. సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందించారు.

చెక్కు అందించిన సీపీ

ఖమ్మంఖానాపురంహవేలి,మే22(ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన ఇద్దరు పోలీసు కుటుంబాలకు సీపీ చెక్కులు అందించారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన హెడ్‌కానిస్టేబుల్ కె. తిరుమల రావు, ఏఆర్‌హెడ్‌కానిస్టేబుల్ జె.కృష్ణ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.7.99లక్షల భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కును గురువారం పోలీస్ కమిషనర్ సునిల్ దత్ అందించారు.

ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఖమ్మంరూరల్,మే22(ఆంధ్రజ్యోతి):ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్రకమిటీ సభ్యుడు పొన్నేకంటి సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముత్తగూడెం, గొల్లగూడెం, బారుగూడెం, మద్దులపల్లి, తెల్దారుపల్లి, గుర్రాలపాడు గ్రామాల్లో ఎక్కువమంది ఉపాధికూలీలు ఉన్నారన్నారు.

ఘనంగా వెంకటరెడ్డి జయంతి

కామేపల్లి,మే22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి దివంగత నేత రాంరెడ్డి వెంకటరెడ్డి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్తలింగాల క్రాస్‌రోడ్‌లోని వెంకటరెడ్డి విగ్రహం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేకు కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథ రెడ్డి, మద్దినేని రమేష్, మాలోత్ బావ్‌సింగ్, బానుప్రతాప్, ఇమామ్, వెంకటేశ్వర్లు, గండు సాగర్ ఉన్నారు.

ఎంవీపాలేన్ని మండలంగా ఏర్పాటు చేయాలి

ఖమ్మంరూరల్, మే22(ఆంధ్రజ్యోతి): ఎంవీపాలెం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని గురువారం కస్నాతండా, కాచిరాజుగూడెం, ఆరెకోడు, ఆరెకోడు తండా, తదితర గ్రామాల్లో నాయకులు, ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రాజకీయ, భౌగోళిక పరిస్థితులపై చర్చించారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోకి వెళ్లిన గ్రామాలను వదిలి మిగిలిన గ్రామాలతో ఎంవీపాలెం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి బియ్యం, నగదు

పంపిణీ చేసిన 44వ డివిజన్ కార్పొరేటర్ పాలేపు విజయ

ఖమ్మంసంక్షేమవిభాగం, మే22(ఆంధ్ర జ్యోతి): కేఎంసీ పారిశుధ్య కార్మికులు సక్రమంగాబాధ్యతలు నిర్వహించటంతోనే ఖమ్మం నగరం అందంగా ఉందని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారని44వడివిజన్‌కార్పొరేటర్ పాలెపు విజయ పేర్కొన్నారు. గురువారం ఆమె పెళ్లి రోజు సందర్భంగా 15మంది జవాను, పారిశుధ్య కార్మికులకు బియ్యం, నగదు అందించారు. కార్మికుల కుటుంబాలు ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని కాంగ్రెస్ నాయకుడు పాలేపువెంకటరమణ ఆకాంక్షించారు. వారికి సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు.



బియ్యం, నగదు అందిస్తున్న కార్పొరేటర్ పాలెపు విజయ, నాయకుడు వెంకటరమణ

కాంగ్రెస్‌లో సంస్థాగత ఎన్నికల సందడి

ఎర్రుపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిల సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖల అధ్యక్షుల ఎన్నికల సందడి కనిపిస్తోంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో పార్టీని సంస్థాగతంగా బలపరిచేందుకు కొన్నినెలలుగా కసరత్తులు జరుగుతోంది. పార్టీకోసం కష్ట పడి పనిచేసిన వారికే ప్రాధాన్యత ఇవ్వాలనిభట్టి సూచించినట్లు సమాచారం. మండలంలో మొత్తం 31 గ్రామశాఖల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగ అప్పటి బీఆర్ఎస్ పార్టీలో ఉండి రాజకీయంగా తలపడిన ప్రత్యర్థులు కూడా భట్టిరాజకీయ చాణక్యంతో కాంగ్రెస్‌లో చేరారు.

శరవేగంగా రాజీవ్ లింక్ కెనాల్ పనులు

- మరో నెలరోజుల్లో పూర్తి
- వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలు సస్యశ్యామలం



సగం వరకు పూర్తైన లైనింగ్ పనులు



లైనింగ్ పనులు జరుగుతున్న దృశ్యం

ఏన్కూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన రాజీవ్ లింక్‌కెనాల్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కాల్వ తవ్వ కాలు, నిర్మాణం, వంతెనలు, అండర్‌టన్నెల్‌ల నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. 5.3 కి.మీ. లైనింగ్ పూర్తయింది. కేవలం 3.4 కి.మీ. లైనింగ్ మిగిలి ఉంది. ఈ పనులు పూర్తయితే ప్రాజెక్ట్ మొత్తం పనులు పూర్తయినట్లే. లైనింగ్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు పనులకుకొంత ఆటంకం కలుగుతోంది. మరో నెలరోజుల్లో పూర్తి కానున్నాయి. సుమారు రూ.100కోట్ల నిధులతో ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్ పనలను వ్యవ సాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవ తీసు కుని పనులను పర్యవేక్షిస్తున్నారు. పనులు ప్రారంభమైన నాటి నుంచి క్షేత్రస్థాయిలో పర్య టించడం, సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ పనులు వేగంగా జరిగేటట్లు చర్యలు చేపట్టారు. అదేవిధంగా భూ నిర్వాసితులకు అందించే ప్యాకేజీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. మార్చి నెలలో నిర్వహించిన ట్రైయల్‌రన్ కూడా విజయవంతం అయింది. ఈ ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేసేందుకు ఇరిగేషన్ శాఖ అధి కారులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ లింకెకె నాల్ పూర్తయితే సాగర్‌జలాలు రాకపోయినా గోదావరి జలాలతో వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయి. వైరా రిజర్వాయర్ కల్లూరు పెద్దచెరువు, సత్తు పల్లి లంకసాగర్ రిజార్వయర్లు నింపడంతో సాగు, తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి. సుమారు లక్షా 25వేల ఎకరాల భూమి సాగు లోకి రానుంది. వైరా నియోజకవర్గంలోని చెరు వులు, కుంటలు నింపడంతో పాటు లిఫ్ట ఇరిగే షన్లు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా ప్రణాళి కలు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పంటల సాగులో రసాయన ఎరువులు తగ్గించాలి



మాట్లాడుతున్న కేవీకే శాసతివేత్త డాక్టర్ రవికుమార్

ముదిగొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): తక్కువ యూరియా వాడకంతో సాగుఖర్చును తగ్గించు కోవచ్చునని వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ తెలి పారు. మండలంలోని పమ్మి గ్రామంలో గురు వారం వైరా కేవీకే ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరం మేరకు రసాయనా లను వినియోగించాలని, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. రైతులు సాగుకు అవసరమైన వాటిని కొనుగోలు చేసిన సమ యంలో ఆయా ఫెర్టిలైజర్ల షాపుల నుంచి రసీ దులు తీసుకొని భద్రపర్చుకోవాలన్నారు. రైతులు శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ వి.చై తన్య, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, వెటర్నరీ డాక్టర్ అశోక్, ఉద్యాన అధికారి శ్రీవిష్ణు, ఏవోలు అరుణకుమారి, సరిత, ఏఈవో లిఖిత, రైతులు పాల్గొన్నారు.

మామిళ్లపల్లి కృష్ణ సంతాప సభ



మాట్లాడుతున్న ఉడతనేని అప్పారావు

సత్తుపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి):సత్తుపల్లి మండలం కిష్టారం సొసైటీ అధ్యక్షుడు మామిళ్లపల్లి కృష్ణ సంతాప సభ గురువారం ఆ గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు సొసైటీ వైస్ చైర్‌పర్సన్ తాటి ఈశ్వరి, సిబ్బంది, డైరెక్టర్లు పాల్గొని సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు ఉడతనేని అప్పారావు మాట్లాడుతూ మామిళ్లపల్లి కృష్ణ గ్రామ సర్పంచిగా, లయన్స్ క్లబ్ బాధ్యుడిగా, సొసైటీ అధ్యక్షుడిగా సేవలందించారని అన్నారు. ఆయన మృతి గ్రామానికి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ పుల్లారావు, డైరెక్టర్లు అప్పారావు, దుర్గాప్రసాద్, భిక్షపతి, కుమారి, విజయ్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచి రేణుక ఈశ్వర్, సొసైటీ సీఈవో వినయ్‌లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్ల అందజేత



ట్రైసైకిళ్లు అందజేసిన దృశ్యం

పెనుబల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): అడవిమల్లెల, పాతకారాయిగూడెం గ్రామాలకు చెందిన ముగ్గురు దివ్యాంగులకు ఈవీఎల్ఐఎంవో సీవో సంస్థ ద్వారా ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను గురువారం అందజేశారు. కార్యక్రమంలో అడవిమల్లెల మాజీ సర్పంచ్ మండదపు అశోక్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా దళిత వైతాళికుడి జయంతి

వైరా, మే 22 (ఆంధ్రజ్యోతి): దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను గురువారం వైరా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ చింతా వేణు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ అసిస్టెంట్ నర్సింహమూర్తి, ఆర్ఐ ప్రదీప్, ఎన్విరాల్‌మెంటల్ ఇంజనీర్ వెంకట్రావ్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

బావిలో పడి ఆవులు మృతి



చింతకాని, మే 23 (ఆంధ్రజ్యోతి): బావిలో పడి ఆవుతో పాటు రెండు దూడలు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం జరిగింది. చింతకాని గ్రామానికి చెందిన బండి సతీష్, ఉసికల తుమ్మలయ్య, గడ్డం రాఘవులు రైతులకు చెందిన ఆవులు గత మూడు రోజుల క్రితం మేతకు బయటకు వదిలారు. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో పొలాల్లో వెతకగా ఓ వ్యవసాయబావిలో మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. తాగునీటి కొరకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాయని, ఆవుల విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటాయని రైతులు తెలిపారు.

భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

- గ్రామాల్లో రెవెన్యూ అధికారుల నియామకం
- కారేపల్లిలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కారేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకంతో పేదవాడి చిరకాల వాంఛ నెరవేరబోతుందని, భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కారేపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇమ్మడి తిరుపతిరావు నివాసంలో ఏర్పాటు చేసిన చేసిన విలేకర్ల సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి మాట్లాడారు. ఇందిరమ్మ మొదటి విడతగా నియోజకవర్గానికి 3500ఇండ్ల చొప్పున మంజూరు చేసిన్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల తుది జాబితా నెలాఖరుకు ఫైనల్ అవుతుందన్నారు. నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లు కట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి పేదవాడికి ఇండ్లు అందుతుందన్నారు. ఇండ్ల కోసం అత్రుత పడాల్సిన అవసరం లేద న్నారు. ఇల్లు కట్టుకున్నావారికి ప్రతి సోమ వారం బిల్లులు అందచేయడం జరుగుతందన్నారు. జూన్2న వేయి ఇండ్లల్లో గృహప్రవేశాలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం భూభారతితో రైతుకు తమ కష్టార్జితంపై భరోసా కల్గుతుందన్నారు. జూన్ 2నుంచి రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన గ్రామాలు మినహా మిగతా రెవిన్యూ గ్రామాల్లో పేరుక పోయిన రెవెన్యూ సమస్యలను పరిష్కారమే లక్ష్యంగా తహసీల్దార్ల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసిందని, నేడు ప్రజల కోరిక మేరకు గ్రామాల్లో రెవెన్యూ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. భూ సర్వేకు రాష్ట్రంలో 6వేలమంది లైసెన్స్ ట్రైనీ సర్వేయర్లను నియమించే కార్యాక్రమాన్ని చేపట్టిన్నట్లు మంత్రితెలిపారు. రైతులకు ఏలాంటి నష్టంలేకుండ తడిసిన వరి దాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సత్తుపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కిష్టారం ఓసీ పీవో ఎంవీ.నరసింహారావు ఆధ్వర్యంలో గురువారం కిష్టారం పంచాయతీ పరిధిలోని మదర్‌థెరీసా కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ శిరీష పలువురు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ విజయ్ సందీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- న్యూడెమోక్రసీ డిమాండ్

సత్తుపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రభుత్వం చేస్తున్న హత్యలపై సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి ఎస్‌కే.ఉమర్ డిమాండ్ చేశారు. గురువారం పామర్తి లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల కోసం ప్రజల్ని చైతన్యవంతం చేయటానికి అడవి బాటపట్టిన నక్సలైట్లను ఎన్‌కౌంటర్ల పేరుతో చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజాస్వామిక వాదులు వ్యతిరేకించాలని కోరారు.

బురదమయంగా అండర్‌పాస్ హైలెవల్ వంతెన



వైరా, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు, కాంట్రాక్టర్ నిర్ల క్ష్యంతో వైరా-నెమలి రూట్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్టేజీ పినపాక-సిరిపురం గ్రామాల మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవేకి అండర్‌పాస్ హైలెవల్ వంతెన నిర్మించారు. ఈ వంతెన కింది భాగంలో రోడ్డు మొత్తం గుంతలమయంగా తయారైంది. ఈ రూట్లోని వాహనచోదకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. అయినప్పటికీ గ్రీన్‌పీల్డ్ హైవే అధికారులు అండర్‌పాస్ హైలెవల్ వంతెన కింద రోడ్డును నిర్మించేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదు. వర్షపు నీటిలోనే ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు ఇతర వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ వంతెనకు రెండువైపులా రోడ్డు మొత్తం బురదగా తయారైంది. అధికారులు స్పందించి ఇప్పటికైనా ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మద్దతు ధరల కోసం ఉద్యమించాలి

- తెలంగాణ రైతుసంఘ జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

బోనకల్, మే 22 (ఆంధ్రజ్యోతి): పంటల గిట్టుబాటు ధరల కోసం దేశవ్యాప్తంగా చేపడుతున్న రైతు ఉద్యమంలో రైతులందరూ భాగస్వామ్యులు కావాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దబీరవల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ.. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ వ్యవసాయ కమీషన్ నివేదికను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ ఉత్పత్తుల ధరలను నిర్ణయించాలని కోరారు. భూ సమగ్ర సర్వే ద్వారానే భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

చింతకాని, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రేఖ వెంకటేశ్వర్లు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు వెంకటేశ్వర్లుకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బస్వాపురం గ్రామానికి చెందిన మండల బీఆర్ఎస్ నాయకులు బొడ్డు వెంకటరామారావు తల్లి ఇటీవల అనారోగ్యానికి గురవడంతో ఆమెను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో నాయకులు పెంట్యాల పుల్లయ్య, గురిజాల హనుమంతరావు, గడ్డం శ్రీను, లచ్చయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీడీసీ ఫీజు చెల్లింపు



యూనిఫాం, నోటుపుస్తకాలు అందిస్తున్న ప్రిన్సిపల్ గోపి

సత్తుపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో అధిక మార్కులు సాధించిన ఓసీ విద్యార్థులకు డిగ్రీ మూడు సంవత్సరాల పాటు ఫీజును కళాశాల ప్రణిణాక అభివృద్ధి కమిటీ చెల్లించనున్నట్లు జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.గోపి చెప్పారు. అడ్మిషన్ పొందిన మొదటి వంద మంది విద్యార్థులకు యూనిఫాంతో పాటు నోటు పుస్తకాలు కూడా ఉచితంగా అందిస్తామని ఆయన అన్నారు. ఇంటర్మీడియట్‌లో 984 మార్కులు సాధించిన సానియా బీఎస్సీ బీజడ్‌సీలో అడ్మిషన్ పొందగా ఆమెకు యూనిఫాం, పుస్తకాలు అందజేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య
- విత్తన చట్టానికి లోబడి రైతులకు విత్తనాలను విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య

బోనకల్, మే 22 (ఆంధ్రజ్యోతి): విత్తన చట్టానికి లోబడి లైసెన్స్ దుకాణదారులు రైతులకు విత్తనాలను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి డి. పుల్లయ్య ఆదేశించారు. బోనకల్ రైతు వేదిక కార్యాలయంలో గురువారం మధిర డివిజన్ డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులను నిబంధనల ప్రకారం అమ్మలన్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి బిల్లులు తీసుకొని భద్రపరుచుకోవాలని కోరారు. స్టాక్ రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పత్తి విత్తనాల అమ్మకాలు చేసిన వాటిని ఎప్పటికప్పుడు రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. ఈ-పాస్ మిషన్ల ద్వార ఎరువుల అమ్మకాలను చేపట్టాలన్నారు. డీలర్లు లైసెన్సు రెన్యూవల్స్‌ను అప్‌డేట్‌గా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం ఈ-పాస్ మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, ఏవోలు వినయ్ కుమార్, సాయి దీక్షిత, మానస, సాయిశివ, చింతకాని ఎస్ఐ నాగుల్‌మీరా, మధిర ఎస్ఐ లక్ష్మీ భార్గవి, ఏఈవోలు పాల్గొన్నారు.

పెనుబల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులు ఎంఆర్పీ ధరలకే అమ్మాలని, రైతులకు అనువుగా ఉన్న విత్తన రకాలను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య అన్నారు. పెనుబల్లి రైతు వేదికలో గురువారం ఎరువుల డీలర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎరువుల అమ్మకాల్లో ఈపీవో మిషన్లు ఉపయోగించాలని, రైతుల ఆధార్‌కార్డు ద్వారానే విక్రయాలు జరపాలని సూచించారు. విత్తన చట్టం, ఎరువులు, పురుగుమందుల చట్టం గురించి అవగాహన కల్పించారు. రైతులకు వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు కల్గించవద్దని సూచించారు. సమావేశంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఎన్ఎఫ్ఎల్ సంస్థ ప్రతినిధులు, ఐదు మండలాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

వైరా, మే 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వైరా డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు తుమ్మలపల్లి కరుణశ్రీ హెచ్చరించారు. వైరా రైతువేదికలో గురువారం మండలంలోని విత్తన డీలర్లతో వ్యవసాయ, పోలీసుశాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా డీలర్లు రసీదు ఇవ్వాలని సూచించారు. అలాగే విత్తన నిల్వల స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్పష్టం చేశారు. వైరా ఎస్ఐ పుష్పాల రామారావు మాట్లాడుతూ.. విత్తనాలమ్మే డీలర్లు స్టాక్ బోర్డు, ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. వైరా ఏవో మయాన్ మంజూఖాన్, ఏఈవో వాసంతి, డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చింతనిప్పు వెంకటయ్య, సభ్యులు వజినేపల్లి కోటేశ్వరరావు, యలమందల నగేష్, శ్రీనివాసరావు, బండారుపల్లి కృష్ణ, వెంకటప్పారావు, వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, సొసైటీ సీఈవోలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- ఊరురా శోభాయాత్రలు

సత్తుపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి వేడుకలను సత్తుపల్లి పట్టణం, మండలంలోని పలు గ్రామాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక ఆలయాల్లో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగయి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

తల్లాడ, మే 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని నారాయణపురంలోని కోదండరామాలయం నంచి అంజనాపురంలో అంజనేయస్వామి దేవాలయం వరకు ఆరు కి.మీ. మేర శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఈ సందర్భగా వేలాది మంది భక్తులు కాషాయజెండాలను చేతబూని పాదయాత్ర చేశారు. ప్రత్యేకపల్లకీలో స్వామి వార్ల విగ్రహాలను ఊరేగించారు. అంజనాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి అర్చకుడు రాధాకృష్ణశర్మఅబిషేకాలు నిర్వహించారుఅనంతరం అన్నదానం చేశారు.



పూజలు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఏన్కూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం బురదరాఘవాపురం గ్రామంలో హనమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారుక. గ్రామశివాలయం ఆవరణలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహనికి భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. అనంతరం కాలినడకన ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లతో జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపుగా పది కి.మీ. గార్లొడ్డు శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం వరకు ర్యాలీగా చేరుకున్నారు.



స్వామి వారి ఊరేగింపులో భక్తులు

కొణిజర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని సింగరాయపాలెం అంజనేయస్వామి వద్ద జయంతి సందన్భంగా చండీయాగం, హనుమాన్‌చాలీసాలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. సింగరాయపాలెం, తుమ్మలపల్లి గ్రామాలలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని భక్తులుకు అన్నదానం చేశారు.

వైరా, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం కన్నుల పండుగగా జరిగాయి. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వైరా ఐఎంఎల్ డిపో వద్దనున్న ఆలయంలో వెంగళి కృష్ణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి అన్నదానం చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పలువురు నాయకులు పూజలు చేశారు. గరికపాడులో ఎస్ఐ పి.రామారావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

చింతకాని, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లచ్చగూడెం గ్రామంలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం విశేష అభిషేక పూజలతో పాటు పంచకుండాత్మక హనుమాత్ కవచహవనం పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు ఇంగువ విద్యాసాగర శర్మ తెలిపారు.

ముదిగొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి వేడుకలను గురువారం మండలంలోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల్లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో దేశభక్తి పెరుగుతుంది



ఫైరింగ్‌లో శిక్షణనిస్తున్న దృశ్యం

వైరా, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ కేవలం శిక్షణ మాత్రమే కాదని, వ్యక్తిత్వ వికాసానికి మూలాధారమని, క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తి వంటి విలువలను అలవర్చుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కే.భద్ర పేర్కొన్నారు. ఎన్‌సీసీ హెడ్‌క్వార్టర్ న్యూఢిల్లీ వారు వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ సీనియర్ సెకండరీ స్కూల్‌కు 11(టి)వ బెటాలియన్ ఖమ్మంవారి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ 'బి' సర్టిఫికెట్‌కు అనుమతినిచ్చారు. దానిలో భాగంగానే ఈనెల 30వరకు న్యూలిటిల్‌ఫ్లవర్ స్కూల్లో ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కల్నల్ భద్ర శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. క్యాడెట్లు అడిగిన పలు ప్రశ్నలకు కల్నల్ సమాధానాలు ఇచ్చారు. అసిస్టెంట్ కల్నల్ నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో క్యాడెట్లకు ఫైరింగ్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఫైరింగ్‌కు ముందు సురక్షిత నియమాలు, ఆయుధ నిర్వహణ విధానాలు, లక్ష్యసాధన పద్ధతులు, ఆయుధధారణ, స్థిరత్వా, శ్వాసనియంత్రణ వంటి అంశాల గురించి అవగాహన కల్పించారు. న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ పాల్గొన్నారు.



ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కె.భద్రకు సెల్యూట్ చేస్తున్న సిబ్బంది